నేటి నుంచి హాకీ సబ్ జూనియర్ పోటీలు

ప్రజాశక్తి-మదనపల్లె

బిటి కళాశాల హాకీ గ్రౌండ్‌లో ఎల్.జి.గిరిరావు 14వ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ అంతర్ జిల్లాల హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని అధ్యక్షుడు పి.వి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, ట్రెజరర్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజా పాల్గొంటారన్నారు. ఈ మ్యాచ్‌లలో అంతర జిల్లాల నుండి హాకీ క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

హాకీ క్రీడాకారులతో నిర్వాహకులు ప్రసాద్‌రెడ్డి

దరఖాస్తులను ప్రాధాన్యతగా పరిష్కరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లావ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యతగా వందశాతం నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ నుంచి పిజిఆర్ఎస్, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిష్కారం, ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన, ప్రభుత్వ భూముల గుర్తింపు, పల్లె పండుగ పనుల ప్రగతి తదితర అంశాలలో డివిజన్ మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సదస్సులలో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో తప్పనిసరి విచారణ చేయాలని పేర్కొన్నారు. కనీసం రోజుకు ఐదు దరఖాస్తులను నాణ్యతగా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల వారీగా అందిన దరఖాస్తులు, పరిష్కారం చేసినవి, ఇంకను పరిష్కరించాల్సినవి, పెండింగ్ ఉండడానికి గల కారణాలపై తహశీల్దార్లు, సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒలను వివరాలను అడిగి తెలుసుకుని తగు సూచనలు ఇచ్చారు. రీసర్వేకు సంబంధించి మండలంలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి, ఎన్ని జాయింట్ ఎల్‌పిఎంలున్నాయి, రెవెన్యూ సదస్సుల్లో అందిన జాయింట్ ఎల్‌పిఎంలు ఎన్ని తదితరాలలో వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పిజిఆర్ఎస్ లో వెంటనే ఆన్‌లైన్ చేసి సర్వీస్ రిక్వెస్ట్ జనరేట్ చేసి నాణ్యతగా పరిష్కరించాలని సూచించారు. ఈ నెల 20 నుంచి ప్రతి మండల కార్యాలయం నుంచి ఇ-ఆఫీసులోనే జిల్లా కేంద్రానికి ఫైల్స్ పంపాలని కలెక్టర్ సూచించారు. ఇందుకు తగిన విధంగా ప్రతి మండల కార్యాలయంలో ఇ-ఆఫీస్‌పై తహశీల్దార్, సంబంధిత సిబ్బంది వెంటనే శిక్షణ పొందాలని తెలిపారు. ఇ ఆఫీస్, ఇ మెయిల్ ఐడిలు క్రియేట్ చేసుకోవాలన్నారు. అందులో ఫైల్స్ ఎలా క్రియేట్ చేయాలి, ఎలా అప్లోడ్ చేయాలి, ఏ విధంగా ఫైల్స్ పంపాలన్న విషయంలో శిక్షణ ద్వారా పూర్తిస్థాయి అవగాహన పొందాలని సూచించారు. పల్లె పండుగకు సంబంధించిన పనులన్నింటినీ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. పనులన్నింటినీ నాణ్యతగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా సిసి రోడ్లు, గోకులాలు, కాలువలు తదితర మంజూరైన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. విసిలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదన్ రావు, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, డ్వామా పీడీ వెంకటరత్నం, పిఆర్ ఎస్ఇ దయాకర్ రెడ్డి, జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మండల స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-చాపాడు (మైదుకూరు)/కడప

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 18వ తేదీన కడప జిల్లా పర్యటన సందర్భంగా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు, జెసి అదితి సింగ్, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డితో కూడిన బృందం గురువారం పరిశీలించింది. ముందుగా మైదుకూరు కోర్టు సమీపంలోని హెలీప్యాడ్‌తోపాటు ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించింది. మైదుకూరు ఆర్టీసీ బస్సు స్టేషన్ పరిసరాలు, ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించి ముఖ్యమంత్రి సభ ఏర్పాటుకు అవసరమైన అనుకులతలను పరిశీలించింది. జిల్లాలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ అమలు తీరు పర్యవేక్షణలో భాగంగా ముఖ్యమంత్రి పర్యటించనున్న మైదుకూరు పట్టణ ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో నివాసాలను, పరిశుధ్య ఏర్పాట్లను కలెక్టర్, ఎస్‌పిలు పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమాల్లో పాల్గొనే అధికారులంతా బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. పారిశుధ్య పనులు పక్కాగా ఉండాలని, తాగునీటి కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కడప ఎయిర్‌పోర్టు, మైదుకూరు హెలిప్యాడ్, షెడ్యూలు ప్రకారం ఏర్పాటు చేసిన కార్యక్రమాల వద్ద ప్రోటోకాల్ మేరకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బద్వేలు, కడప ఆర్‌డిఒలు చంద్రమోహన్, జాన్ ఇర్విన్, డిఇఒ రాజ్యలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, మున్సిపల్, ఎపిఎంఎస్ఐడిసి, విద్యుత్, ఆర్అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనను విజయవంతం చేయండి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మైదుకూరు పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ముందస్తు ఏర్పాట్లపై జెసి అదితి సింగ్, డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడులతో కలిసి జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా అధికారులకు వివిధ బాధ్యతలను అప్పగించామన్నారు. పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికా బద్ధంగా గట్టి ఏర్పాట్లు చేయాలని విధులను కేటాయించిన అధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, కడప, జమ్మలమడుగు, బద్వేలు ఆర్‌డిఒలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఇన్‌ఛార్జి సిపిఒ హజరతయ్య, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

మైదుకూరులో సిఎం ఏర్పాట్లను పరిశీలిస్తున్న కడప జిల్లా కలెక్టర్, ఎస్‌పి

సిటిఎం పంచాయతీ రికార్డులు స్వాధీనం

- రెండు రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక : డిఎల్‌పిఒ నాగరాజు

మాట్లాడుతున్న డిఎల్‌పిఒ నాగరాజు

రికార్డులు పరిశీలిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని సిటిఎం పంచాయతీ-2లో నిధులు దుర్వినియోగం అయ్యాయన్న ఆరోపణలపై ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు గురువారం డిఎల్‌పిఒ నాగరాజు విచారణ చేపట్టారు. 2021 నుంచి 2024 వరకు పంచాయతీకి వచ్చిన రాష్ట్ర, కేంద్ర నిధులు, జనరల్ నిధులకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని స్థానికంగా ఉన్న ఉత్తన్న, గంగరాజు, సుబ్రహ్మణ్యం శాస్త్రి ఆర్‌టిఐ కింద దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు వారికి పంచాయతీ సెక్రెటరీ ఇవ్వక పోవడంతో నిధులు దుర్వినియోగం కావడంతోనే సమాచారం ఇవ్వలేదన్న అనుమానంతో నేరుగా రాజధాని అమరావతికి వెళ్లి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌లను కలిసి సిటిఎం పంచాయతీ-2కు వచ్చిన నిధులు దుర్వినియోగం అయ్యాయని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని ఫిర్యాదు చేశారు. స్పందించిన మంత్రులు అక్కడ జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని ప్రిన్సిపల్ సెక్రటరీకి సిఫారసు చేశారు. ఈ మేరకు నిధుల దుర్వినియోగం, ఇతరత్రా వివరాలపై విచారించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రిన్సిపల్ సెక్రటరీ జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారు. అధికార యంత్రాంగం పరుగులు పెట్టింది. సిటిఎం పంచాయతీ-2లో విచారణ చేయాలని కలెక్టర్ డిఎల్‌పిఒ నాగరాజుకు ఆదేశాలివ్వడంతో ఇఒపిఆర్‌డి అబ్దుల్ షుకూర్‌తో కలిసి సిటిఎం పంచాయతీ-2 సచివాలయానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఒ నాగరాజు విలేకరులతో మాట్లాడుతూ గతంలో సెక్రటరీలుగా పనిచేసిన మనోహర్, వెంకటేశ్వర్లు, ప్రస్తుత సెక్రటరీ భాను ప్రసాద్ సమావేశాలు నిర్వహించలేదని, మినిట్స్ రాయలేదని చెప్పారు. ఆదాయ వ్యయాలకు సంబంధించి ఎలాంటి జమా ఖర్చులు రాయలేదని తెలిపారు. పిటీషనర్లు ఇచ్చిన అర్జీ మేరకు దాంతో పాటు 2021 నుంచి 2024 వరకు పంచాయతీకి వచ్చిన నిధులు దుర్వినియోగం అయ్యాయని దరఖాస్తు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణకు వచ్చామన్నారు. పంచాయతీ ఏర్పాటైన మూడేళ్ల కాలానికి సంబంధించి పూర్తి రికార్డులను స్వాధీనం చేసుకున్నామని, వాటన్నిటిని పరిశీలించి రెండు రోజుల్లో పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి : కలెక్టర్

గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

ఎన్‌టిఆర్ నగర్ గృహ నిర్మాణ లేఔట్ లలో ఇళ్ల నిర్మాణ ప్రగతితో పాటు మౌలిక సదుపాయాల కల్పనలను వేగవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి రూరల్ దిగువ అబ్బవరం, ఎపి మోడల్ స్కూల్ ఎదురుగా ఉన్న ఎన్‌టిఆర్ నగర్ గృహ నిర్మాణ లేఔట్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాలనీలలో మంజూరైన గృహాలు ఎన్ని, పూర్తయినవి ఎన్ని, ఆర్‌సి, ఆర్‌ఎల్‌లో ఉన్నవి ఎన్ని, వివిధ దశల్లో ఉన్న గృహాల సంఖ్య ఎంత అని కలెక్టర్ ఆరా తీశారు. ఎన్‌టిఆర్ నగర్‌లో మొత్తం 93 గృహాలు మంజూరయ్యాయని, 43 గృహాలు పూర్తయ్యాయని, ఆర్‌సి 3, ఆర్ఎల్ 9, అలాగే ఎపి మోడల్ స్కూల్ ఎదురుగా ఉన్న లేఅవుట్‌లో 568 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 185 గృహాలు పూర్తయ్యాయని చెప్పారు. ఆర్‌సి 33, ఆర్ఎల్ 98, బిఎల్‌బిబిఎల్‌లో మిగిలిన గృహాలు ఉన్నట్లు జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ శివయ్య కలెక్టరుకు వివరించారు. ఆర్‌సి, ఆర్‌ఎల్‌లో ఉన్న గృహాలన్నీ ఈ నెలాఖరులోగా నిర్మాణాలు పూర్తి చేసుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని చెప్పారున. ఈ సందర్భంగా దిగువ అబ్బవరం ఎన్టీఆర్ నగర్‌లో నిర్వహిస్తున్న సిసి రోడ్ల నిర్మాణ ప్రగతిని కలెక్టర్ పరిశీలించారు. మెయిన్ రోడ్డు నుంచి కాలనీలోకి ప్రధాన అప్రోచ్ రోడ్డు 310 మీటర్లు ఉందని, సదరు కాలనీ, ఎదురుగా ఉన్న లే అవుట్‌లలో మొత్తం మీటర్ల మేర సిసి రోడ్లు నిర్మిస్తున్నట్లు పంచాయతీరాజ్ ఎస్ఇ దయాకర్ రెడ్డి వివరించారు. సదరు లేఅవుట్లలో కొంత మేర ఇప్పటికే సిసి రోడ్ల నిర్మాణం కూడా పూర్తిచేసే క్యూరింగ్ చేయడం జరుగుతోందని వివరించారు. సిసిరోడ్డు నిర్మాణ పనులను నత్తనడకన కాకుండా యుద్ధ ప్రాతిపదికన వేగవంతంగా పూర్తి చేయాలని, ఇందుకు మిషన్లు, లేబర్‌ను పెంచాలని ఈ నెలాఖరులోగా క్యూరింగ్‌తో సహా సిసి రోడ్లను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నీటి ఇబ్బందులు లేకుండా అవసరమైతే ప్రస్తుతం ఉన్న బోర్లను రీఛార్జ్ చేయించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ఎన్‌టిఆర్ నగర్ ప్రవేశ మార్గం వద్ద 'పిఎంఎవై-ఎన్టీఆర్ నగర్' ఆర్చ్ నిర్మాణం వెంటనే చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖను ఆదేశించారు. అనంతరం వివిధ అంశాలలో అధికారులతో చర్చించి తగు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శివయ్య, పంచాయితీ రాజ్ ఎస్ఈ దయాకర్ రెడ్డి, ఆర్అండ్‌బి డిఇ సహదేవ రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, మండల స్పెషల్ ఆఫీసర్ గుణశేఖర్ పిళ్ళై, హౌసింగ్ డిఇ సుబ్బరామయ్య, ఎఇ రామ్మోహన్ రెడ్డి, తహశీల్దార్ పుల్లారెడ్డి, ఎంపిడిఒ వెంకటేష్, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

'పునర్జన్మ' లఘు చిత్రం షూటింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నేత్ర, అవయవ దానం ఆవశ్యకతపై పునర్జన్మ లఘు చిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు దర్శకులు పిఎస్.నారాయణ తెలిపారు. గురువారం మదనపల్లి బైపాస్ రోడ్డు, దక్షిణ శిరిడి సాయిబాబా ఆలయంలో ముహూర్తం సన్నివేశాన్ని చిత్రీకరించారు. ఈ లఘు చిత్రానికి ఆలయ ధర్మకర్త గోపాల్‌రెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేయగా, బిటి కళాశాల కరస్పాండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ముని రత్నమయ్య క్లాప్ కొట్టారు. దక్షిణ శిరిడి సాయిబాబా ఆలయంలో స్వామి వారికి జలాభిషేకం నిర్వహించి పూజలు చేసిన అనంతరం లఘు చిత్రం షూటింగ్ ప్రారంభించారు. ఈ చిత్రానికి దర్శకులుగా నారాయణ, నిర్మాతగా ఎం.జె.రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా రాజశేఖర్, కెమెరామెన్‌గా అడుసువిల్లి విజయ్ కుమార్, సంగీతం శంభు ప్రసాద్, ఎడిటింగ్ జానకిరామ్, ముఖ్య పాత్రలలో డాక్టర్ గొల్లపూడి తిరుపతి రావు, జంగారెడ్డి, వెంకటరమణారెడ్డి, భవ్య శ్రీ, సుమారెడ్డి వ్యవహరిం చనున్నారు. ఈ సందర్భంగా దర్శకులు నారాయణ మాట్లాడుతూ అవయవదానంపై సమాజాన్ని మేల్కొల్పి ప్రజలను చైతన్య పరచాలనే సదుద్దేశంతో నిత్య నూతన సంస్థ ద్వారా పునర్జన్మ లఘుచిత్రాన్ని తీస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్ర నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి తెలుగు సంవత్సరాది ఉగాదికి విడుదల చేసే ప్రయత్నం చేస్తామన్నారు. పునర్జన్మ లఘుచిత్రం అవయవదానం ఆవశ్యకత గురించి సమాజాన్ని చైతన్య పరచుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిఎస్ఎ. కృష్ణమూర్తి, కె.వెంకటరమణ,దర్శకులు రాజా, జన్నత్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

పేదలకు కూరగాయలు పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె వారపు సంతలో కూరగాయల మండి నిర్వహిస్తున్న కెజె మండి నిర్వాహకులు దాదాపీర్, ఖాజాపీర్ గురువారం చిప్పిలి ప్రాంతంలో పేదలకు కూరగాయలు పంపిణీ చేశారు. తిరుమల ట్రస్టుకు, మదరసాలకు, చర్చిలకు, ప్రార్థనా మందిరాలకు ఉచితంగా కూరగాయలు పంపిణీ చేసే దాదాపీర్ సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని పేదలకు కూరగాయలు పంపిణీ చేయడాన్ని ఆ ప్రాంత ప్రజలు అభినందించారు. ఈ సందర్భంగా దాదాపేర్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలకు, అనాథాశ్రమాలకు, నిత్యాన్నదాన ట్రస్టులకు, పేదల. కార్యక్రమంలో స్థానిక ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కిడ్నీ బాధితురాలు కీర్తికి గురువారం మదనపల్లె వాసులు రూ.70,350లు ఆర్థిక సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం, చిన్నపురం గ్రామానికి చెందిన ఓబుల్‌రెడ్డి కుమార్తె కీర్తి కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. బిడ్డను కాపాడుకోవాలని తల్లిదండ్రులు తమకున్న సంపదనంతా ఖర్చు చేశారు. అయినా ఫలితం దక్కలేదు. బిడ్డ కోసం ఒక కిడ్నీ దానం చేయడానికి తల్లి, తండ్రి సిద్ధపడ్డారు. ఆ కిడ్నీ మార్పిడికి డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతూ దాతలను అర్థించారు. స్పందించిన మదనపల్లె వాసులు రూ.70,350లు సేకరించి కీర్తి తండ్రి ఓబుల్‌రెడ్డికి మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి అందజేశారు. ఆర్థిక సాయం అందించిన దాతలలో మద్దిరెడ్డి రూ.25 వేలు, నాగభూషణ్ రూ.5,116, రిటైర్డ్ ఇంజినీర్ ఎస్.రాజగోపాల్‌రెడ్డి రూ.5 వేలు అంకిశెట్టిపల్లి రెడ్డిశేఖర్‌రెడ్డి రూ.5 వేలు మరికొంత తమ శక్తిమేర ఆర్థిక సాయం అందించారు. అర్థిక సాయం చేసిన దాతలకు ఓబుల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

బాధితురాలు తండ్రి ఓబుల్‌రెడ్డికి ఆర్థిక సాయం అందిస్తున్న మద్దిరెడ్డి

'పిఎం ఇంటర్న్‌షిప్' యువతకు సువర్ణావకాశం

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

ఎపి, కేంద్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా యువతకు ఉత్తమమైన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. పథకం ద్వారా యువతకు ప్రతిష్టాత్మక కంపెనీల్లో పని అనుభవం, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సహాయం లభిస్తుందిన్నారు. ఇంటర్న్‌షిప్ చేయడానికి టాప్ 500 కంపెనీలతో ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. 6- 12 నెలల ఇంటర్న్‌షిప్ ప్రాక్టికల్ ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన వారికి వన్‌టైమ్ గ్రాంట్ రూ.6 వేలు, ప్రతి నెలా రూ.4,500 కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.500, సిఎస్‌ఆర్ నిధుల ద్వారా ఆర్థిక సాయం మొత్తం రూ.5 వేలు అందుతుందని తెలిపారు. ప్రధానమంత్రి జీవిత బీమా యోజన, ప్రధానమంత్రి ప్రమాద బీమా యోజన వర్తిస్తుందని తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 24 సంవత్సరాలు, పదవ తరగతి లేదా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, ఐటిఐ, పాలిటెక్నిక్, బిఎ, బిఎస్‌సి, బికాం, బిసిఎ, బిబిఎ, బి.ఫార్మసి, బి.టెక్ వంటి డిగ్రీలు పూర్తి చేసిన వారు, చివరి సెమిస్టర్ చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఐఐటి, ఐఐఎంఎస్, నేషనల్ లా యూనివర్సిటీలు, ఐఐఎస్ఇఆర్, ఎన్ఐడి, ఐఐటి నుంచి పట్టభద్రులైన వారు, సిఎ, సిఎంఎ, సిఎస్, ఎంబిబిఎస్, బిడిఎస్, ఎంబిఎ లేదా మాస్టర్స్ లేదా అంతకంటే ఉన్నతమైన అర్హులని తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను https://pminternship.mca.gov.in/login ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ సత్య నారాయణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నాగార్జున పాల్గొన్నారు.

జాతీయ రహదారి మాసోత్సవాలను విజయవంతం చేయాలి : ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు జిల్లాలో నిర్వహించే జాతీయ రహదారి మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో 'జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు - 2025' కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్లు, బుక్‌లెట్లు, బ్రోచర్లను కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించే జాతీయ భద్రత మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజలందరికీ రహదారిపై భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ, ఎంవిఐ, డిఎంహెచ్ఒ కొండయ్య పాల్గొన్నారు.

ఇసుక టెండర్లలో బాహాబాహీ

- టిడిపి ప్రజాప్రతినిధుల అనుచరుల హల్‌చల్
- గండికొవ్వూరు, గుండ్లామూల రీచ్‌లకు టెండర్లు
- టెండరు గది మూసివేతకు యత్నం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వ్యవహారం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని ఇసుకరీచ్‌ల టెండర్ల దాఖలు వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల అనుచరుల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. గురువారం జిల్లా గనులశాఖ అధికార యంత్రాంగం కోర్టు పరిధిలో ఉన్న పులివెందుల నియోజకవర్గ పరిధిలోని చక్రాయపేట మండలంలోని గండికొవ్వూరు, రాజంపేట నియోజకవర్గ సిద్ధవటం మండల పరిధిలోని గుండ్లామూల ఇసుక రీచ్‌లకు ఆఫ్‌లైన్‌లో టెండర్లు పిలిచింది. ఇసుక రీచ్‌ల టెండర్లలో పాల్గొనేందుకు పులివెందులకు చెందిన ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్సీ అనుచరులు, సిద్ధవటం మండల పరిధిలోని గుండ్లామూల ఇసుక రీచ్ టెండరు దాఖలు చేయడానికి కడప, కమలాపురం ఎమ్మెల్యేల అనుచరుల పేరుతో పలువురు టెండర్లు దాఖలుకు హాజరయ్యారు. చక్రాయపేట మండలం గండికొవ్వూరు రీచ్‌కు టెండరు దాఖలు చేయడంలో మాజీ ఎమ్మెల్సీ బి.టెక్ రవి అనుచరులు పెద్దఎత్తున టెండర్లు గదిని ఆక్రమించుకుని మూత వేయడానికి ప్రయత్నం చేశారు. సిద్ధవటం మండలానికి చెందిన గుండ్లామూల ఇసుక రీచ్ టెండరు దాఖలు చేయడానికి సైతం కడప, కమలాపురం నియోజకవర్గ ప్రజాప్రతినిధుల, సిద్ధవటం మండలానికి చెందిన జనసేన నాయకులు, ఆయన అనుచరులు పెద్దఎత్తున హాజరు కావడంతో గందరగోళ వాతావరణం ఏర్పడింది. ఇసుకరీచ్‌ల టెండర్ల దాఖలు వ్యవహారం దాదాపుగా స్తంభించింది. మధ్యాహ్నానంతరం పోలీసులు రంగప్రవేశం చేయడంతో వ్యవహారం కొలిక్కి వచ్చింది. పోలీసుల జోక్యం చేసుకోవడంతో టెండర్లు దాఖలుదారులను మినహా మిగిలిన అనుచరులను చెదరగొట్టడం, గనుల శాఖలోనికి అనుమతించకపోవడంతో టెండర్ల వ్యవహారం ప్రశాంతంగా నిర్వహించడం జిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. గండికొవ్వూరు ఇసుక రీచ్‌కు 2, గుండ్లామూల ఇసుక రీచ్‌కు 14 టెండర్లు దాఖలు కావడం గమనార్హం. కలెక్టర్ ఆదేశాల ప్రకారం తదుపరి షెడ్యూలు ప్రకారం వెళ్తామని గనులశాఖ డిడి పేర్కొనడం గమనార్హం.

మైనింగ్ కార్యాలయం వద్ద గుమిగూడిన టెండరుదారులు

మాజీ మంత్రి శైలజానాథ్‌ను సన్మానిస్తున్న ఎన్‌ఎస్‌యుఐ నాయకులు

శైలజానాథ్‌ను కలిసిన ఎన్‌ఎస్‌యుఐ నాయకులు

ప్రజాశక్తి-పీలేరు

తిరుపతి నుంచి అనంతపురం వెళుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌ను గురువారం పీలేరులో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్ తేజ ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను విద్యార్థి నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థి నేత అమృత్ తేజను శైలజానాథ్, ఆయన కుమారుడు రుత్విక్ ఆత్మీయంగా పలకరించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమృత్ తేజ మాట్లాడుతూ మాజీ మంత్రి శైలజానాథ్‌ను కలవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. రాజకీయాల్లో ఆయన తనదైన ముద్ర వేసుకున్న గొప్ప నేతని కొనియాడారు. రాష్ట్ర విభజన సమయంలో సమైక్యాంధ్ర ఉద్యమంలో ఆయన కీలక పాత్ర పోషించి ఉద్యమాన్ని ఉధృతం చేసిన వ్యక్తి అని, అదేవిధంగా ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు అనేక ఉద్యమాలు చేసి ప్రజల పక్షాన పోరాటాలు అనేకం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు సాయి సంపత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా కార్యదర్శి యూసఫ్, పాల్గొన్నారు.

ప్రజలకు సేవలందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-పీలేరు : ప్రజలకు అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయి నుంచి వారికి సేవలు అందించడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యంగా పెట్టుకుందని పీలేరు తెలుగు యువత అధ్యక్షులు స్వోర్ట్స్ మల్లి తెలిపారు. గురువారం పీలేరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని అన్నారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి కూడా తన నియోజకవర్గ పరిధిలో మెరుగైన అభివృద్ధిని సాధించడం కోసం విశేష కృషి చేస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్.టి.ఆర్ భరోసా పథకం ద్వారా సామాజిక పెన్షన్లను ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.4 వేలు, రూ.6 వేలు, రూ.10 వేలు, రూ.15 వేలకు పెంచి అందిస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు రూ.వెయ్యి పెన్షన్ పెంచడానికి ఐదేళ్లు పట్టిందని విమర్శించారు. ఇంత పెద్దమొత్తంలో పెన్షన్‌ను దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వడం లేదన్నారు. తమ ప్రభుత్వంలో మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం దీపం-2 పథకం ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను ఇస్తున్నామని తెలియ జేశారు. ఈ ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత తెలుగు దేశం, జనసేన, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని అన్నారు. బాబు సూపర్ 6 హామీలు, నిరుద్యోగ యువత కోసం మెగా డిఎస్సీకి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నారని తెలిపారు. జాబ్ కేలండర్ ద్వారా ఉద్యోగాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. గత ప్రభుత్వంలో ఏర్పడిన లోటు పూడ్చుడానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తూందని చెప్పారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, తప్పిదాల ఫలితంగా కూటమి ప్రభుత్వం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడినప్పటికీ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండింటికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు తీసుకు వెళుతున్నట్లు తెలియజేశారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కూడా తీసుకుంటున్నట్లు వివరించారు.

రోడ్డుపై పారుతున్న మురుగునీరు

రోడ్డుపైనే మురుగునీరు

- ఇబ్బందుల్లో ప్రజలు
- పట్టని పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని గోరాన్‌చెరువు పంచాయతీ వడిసేలావంకపల్లి వద్ద బస్సు దిగాలన్నా..ఎక్కాలన్నా బురద నీటిలో కాలు పెట్టాల్సిందేనని ప్రజలు వాపోతున్నారు. ఇరువై పులా ఉన్న గృహాలు ముందు మురుగు నీటి గుంట నిల్వ ఉంచుకోక పోవడంతో బాత్రూంలో వాడే నీరు, బట్టలు ఉతికిన నీరు, ఇల్లు శుభ్రం చేసి వచ్చే మురుగు నీరంతా రోడ్డుపైకి వదు లు తుండటంతో రోడ్డుపై నడవాలంటే ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. కిలో మీటరు పొడవునా ఈ మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండంతో దుర్వాసతో వెదజల్లడంతో పాటు దోమలు వృద్ధి చెందిన విషజ్వరాల బారిన పడే ప్రమాదముందని పాదాచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మరుగుదొడ్లు, నీరు నిలువ ఉండడానికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోని రోడ్డుపై మురుగునీరు పారకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నూతనంగా ఎన్నికైన ట్రాక్టర్ల యూనియన్ సభ్యులు

ట్రాక్టర్ల యూనియన్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని ట్రాక్టర్ల యజమానులు కమిటీని ఎన్నుకున్నట్లు మండల యూనియన్ నాయకులు నంద్యాల సుధాకర్, గాలి వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం హరినాథరెడ్డి ప్లాట్‌లో సమావేశం నిర్వహించి ట్రాక్టర్ల యూనియన్ కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండ లంలో ట్రాక్టర్ యజమానుల సమస్యలపైన పోరాటం చేసేందుకు కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కమిటీలు 30 మంది పైన పాల్గొని కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు చెప్పారు. యూనియన్ అధ్యక్షులుగా ఎం.సుధాకర్ జి.వెంకటరమణ, గౌరవ సలహాదారులుగా చెరువు మహేష్, రమణయ్య, రఫీ ఉపాధ్య క్షులుగా తిమ్మారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, దేవారెడ్డి, కార్యదర్శిగా బండి సుబ్బరామయ్య, సహాయ కార్యదర్శులుగా పి.మణి, ఎస్.మోటే నాయకులుగా గంగయ్య, రామరాజు ప్రదీప్, కమిటీ సభ్యులుగా మల్లేష్, వెంకట కృష్ణయ్య, రవిలను ఎన్నుకున్నుట్లు తెలిపారు. మండలంలో ట్రాక్టర్ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు త్వరలోనే యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. సుండుపల్లె తహశీల్దార్, ఎస్ఐలను ఆహ్వానితుల కమిటీలో చేర్చుకున్నట్లు తెలిపారు.

బస్టాండ్ ప్రాంతంలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

గాలివీడులో కుక్కల బెడద

- భయాందోళన చెందుతున్న ప్రజలు

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక పంచాయతీ పరిధిలో బస్టాండ్ పరిసరాలలో కుక్కల బెడద అధికంగా ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.చిన్నపిల్లలు, వృద్దులు,మహిళలు బయటకు రావాలంటే భయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది కుక్కకాటుకు గురై ఆస్పత్రి పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పంచాయతీ సిబ్బంది కొన్ని కుక్కలను పట్టుకొని దూరంగా వదిలిపెట్టారని, మరల ఇప్పుడు కక్కల సంఖ్య ఎక్కువై గుంపులు గుంపులు సంచరిస్తూ దారిన వెళ్లే వారిని వెంబడిస్తున్నాయని పేర్కొన్నారు. కుక్క కాటుకు గురై చాలా మంది చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధుల్లో సంచరి స్తున్న కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

బిసి లబ్ధిదారుల్లో ఆందోళన వద్దు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె : బిసి జాబితాకు చెందిన లబ్ధిదారులు బ్యాంకు అనుసంధానంతో సబ్సిడీ రుణాల కొరకు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ ద్వారా జిల్లాలోని బిసి, ఇబిసి, కాపు, బలిజ, తెలగ, ఒంట సామాజిక వర్గాలకు చెందిన లబ్ధిదారులు బ్యాంకు అను సంధానముతో సబ్సిడీతో కూడిన రుణములకు సంబంధించి అర్హత కలిగిన లబ్ధిదారులు ఎపిఒబిఎంఎంఎస్ వెబ్ సైట్‌లో ఈ నెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని గతంలో తెలియజేశామని అన్నారు. సాంకేతికత కారణాల వలన ఎపిఒ బిఎంఎంఎస్ వెబ్‌సైట్ అందుబాటులో లేద న్నారు. 16వ తేదీతో బ్యాంకు అనుసంధానంతో సబ్సిడీతో కూడిన రుణ ములకు దరఖాస్తు కొరకు గడువు ముగియడంతో లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఎపిఒ బిఎంఎంఎస్ వెబ్ సైట్ పూర్తి గా అందుబాటులోకి వచ్చిన వెంటనే తదుపరి తేదీలను ప్రకటిస్తామని తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE LAKKIREDDYPALLI

O.S.No. 28/2024

Peddaputha Asif and others ... **Plaintiffs**

Vs

Padigalapalle Khajabe and others.
1. Padigalapalle Khajabe, W/o. Nazeer Basha,, R/o. Kurabalakota Village, post & Mandal, Annamayya Dist.
2. Peddaputha Jaleel, S/o. Rasool Sab, R/o. Reddivaripalli Village, Lakkireddipalli Post & Mandal, Annamayya Dist.
8. Meddolu Rahamathbi, W/o.Yasanulla, R/o. Dudekulapalli, T.Chandrevaripalli, Kalikiri Mandal, Annamayya Dist.

...Defendants

SUMMONS ORDER-5 RULE-1, 5 C.P.C.

WHEREAS the plaintiff has instituted a suit against you for the plaint mentioned relief vide plaint copy attached herewith, you are hereby summoned to appear in the Court in person or by a Pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some other person able to answer all such questions on the day of 24-1-2025 2024 at 10.30 o' clock in the forenoon answer the claim and your are directed to produce on that day all the documents upon which you intend to rely in support of defence.

TAKE notice that, in default of your appearance on the day before mentioned the suit will be heard and determined in your absence.

GIVEN under my hand and the seal of the Court this 10th December-2024

//By Order of the Court//

V.AZMATHULLAH, B.A.,B.L.,
Advocate for Plaintiff,
RAYCHOTY. Cell: 99636 12791.

యువకుడి మృతదేహం కోసం ముమ్మర గాలింపు

ప్రజాశక్తి-కలకడ

వెంకట రత్నం (ఫైల్ ఫొటో)

గల్లంతైన యువకుడి కోసం పోలీసులు గాలింపులు ముమ్మరం చేస్తున్నారు. మండలం లోని కోటగుడబండ పంచాయతీ చొక్కన్నగారిపల్లికి చెందిన సూరి కుమారుడు వెంకటరత్నం బుధ వారం తమ స్నేహితులతో కలసి గుర్రంకొండ మండలం దద్దాల వారిపల్లికి సమీపంలో ఉన్న గ్రానైట్ కోసం తవ్విన గుంతలో ఈత ఆడటానికి వెళ్లినట్లు తెలిపారు. తన స్నేహితులతో ఈత ఆడుతూ వెంకటరత్నం గుంతలో మునిగి ఇంతవరకు కనిపించకపోవడంతో స్థానిక పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయినట్టు తెలిపారు. వెంకటరత్నం లండన్ లో ఎంఎస్ చదువుతూ అక్కడే ఉద్యోగం చేస్తూ, సంక్రాంతి కోసం ఊరికి వచ్చినట్లు తల్లిదండ్రులు తెలిపారు. స్నేహితులతో కలిసి సంతోషంగా విహారయాత్రకు గల్లంతు కావడంతో తల్లిదండ్రులు, బంధువుల్లో తీవ్ర విషాదం అలుముకుంది. వెంకట రత్నం ఈనెల 25న తిరిగి లండన్‌కు వెళ్ల వలసి ఉండగా ఈలోపే జరగరాని నష్టం జరిగిపోయిందని బోరున విలపి స్తున్నారు. గ్రానైట్ రాళ్ల కోసం తవ్విన గుంతను పూడ్చకుండా అలాగే వదిలేయడంతో ఎంతో మంది ప్రాణాలు బలవు తున్నాయని, గుంతను తవ్విన వారిపై కేసు నమోదు చేయాలని స్థానికులు పేర్కొన్నారు. ఎంత ఖర్చయినా భరిస్తామని తమ కొడుకు మృతదేహం ఆచూకీని కనుగొనాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వెంకటరత్నం మృతదేహం కోసం గాలిస్తున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు

మృతదేహాన్ని వెంటనే వెలికితీయండి : ఎమ్మెల్యే

ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

ఈతకు వెళ్లి మృతి చెందిన వెంకటరత్నం మృతదేహాన్ని వెంటనే వెలికి తీయాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గజ ఈతగాళ్లతో రెండు రోజులుగా మృత దేహం కోసం గాలింపు చర్యలు చేపట్టిన విషయం తెలుసుకున్న ఆయన కలెక్టర్ చామకూరి శ్రీధర్, డిఆర్ఒతో మాట్లాడి ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాన్ని రప్పించి వెంటనే మృతదేహాన్ని బయటకు తీయాల్సిందిగా కోరారు. మృతదేహం కోసం ఎన్‌డిఆర్‌ఎఫ్ దళాలు జల్లెడ పడుతున్నాయి.

పేద ప్రజల్లో పండుగ సంతోషం లేదు : 'ఆకేపాటి'

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-వీరబల్లి

ఈ యేడాది పేద ప్రజల్లో పండుగు ఉత్సాహం కనిపించలేదని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గుర్రప్పగారిపల్లె పంచాయతీలో కోనేటివారిపల్లెలో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలు, కార్యకర్తలతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పేద ప్రజల్లో పండుగ ఆనందం పెద్దగా కానరాలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు ఇప్పటికీ అమలు కాకపోవడంతో పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాల అందకపోవడంతో వారి ముఖాలలో చిరునవ్వు లోపించిందన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వంలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు, అన్ని సామాజిక వర్గాలకు, రైతులకు, ఆటోకార్మికులకు, డ్వాక్రా మహిళలకు, రజకులకు, దర్జీలకు, విద్యార్థులకు అమ్మ ఒడి, డ్వాక్రా మహిళలకు, 45 సంవత్సరాలు నిండిన మహిళలకు నవరత్నాల పథకంతో ఆర్థిక లబ్ధి చేకూర్చారని అన్నారు. ఇలా ఎన్నో నవరత్న పథకాలు ద్వారా ప్రతినెల వారి ఖాతాలో జమ చేస్తుండటంతో ఏ పండగ వచ్చినా చిరునవ్వుతో పండుగను జరుపుకునే వారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసి చివరికి సంక్రాంతి పండగ కూడా ఏ కానుక ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ముఖ్యంగా రైతు భరోసా ఇంత వరకు ఇవ్వలేదన్నారు. అనంతరం బెజవాడ దళితవాడలో వైసిపి కార్యకర్త బెజవాడ సుబ్బయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుస ుకున్న అమర్నాథరెడ్డి సుబ్బయ్య మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శ్రీరాము లురెడ్డి, సుబ్బరామరాజు, ఈశ్వరయ్య, చక్రి నాయుడు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-చిట్వేలి

అటవీజంతుల దాడిలో పంట నష్టపోయిన రైతులను గురు వారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టిడిపి యువ నాయకులు ముక్కా సాయివి కాస్‌రెడ్డి పరామర్శించారు. మండలంలో మైపల్లి పంచాయతీ యం.రాచపల్లి గ్రామంలోని వెలిగేల్లా ఈశ్వరాజు పొలంలోని 5,800 బొప్పాయి పిల్ల మొక్కలను, సుక్కరాజు పెంచల్‌రాజు, ఉమ్మలారాజు చాముండేశ్వరి పక్కన పొలాల్లో 15వేల బొప్పాయి చెట్ల పిల్ల మొక్కలను అటవీ జంతువులు నాశనం చేశాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీధర్, సాయివికాస్ రైతుల పంట పొలాల దగ్గరికి వెళ్లి మొక్కలను పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పంట నష్టపరిహారం వచ్చేలా కృషి చేస్తామని రైతులకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో రాజుకుంట సర్పంచ్ గుత్తి నర్సిం హులు, వివిధ శాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్, సాయివికాస్‌రెడ్డి

ప్రభుత్వ రుణాలతో ఆదాయం, అభివృద్ధి : ఎపిఎం

మాట్లాడుతున్న ఎపిఎం ఖాదరవలి

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రభుత్వాలు ఇచ్చే రుణాలతో ఆదాయం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఎపిఎం ఖాదర్‌వలి కోరారు. గురువారం రాగిమానుదిన్నేపల్లి ప్రాథమిక పాఠశాలలో పెద్దివీడు గ్రామ సమాఖ్య-2 కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎపిఎం హాజరై మాట్లాడారు. సంఘాల ద్వారా పొందే రుణాలతో స్థిరమైన జీవనోపాధులను ఏర్పా టు చేసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబం కనీసం ఐదు కంటే ఎక్కువ జీవనోపాధుల ఏర్పాటు చేసుకొని ప్రతి జీవనోపాధికి రూ.10వేలు ఆదాయం పొందాలని తెలిపారు. అలాంటి వారికి బ్యాంకుల ద్వారా వ్యక్తిగత రుణాలు మంజూరు చేయిస్తామని చెప్పారు. నీటి సౌకర్యం గల రైతులు చేపల పెంపకం వల్ల మెర ుగైన ఆదాయాలు సంపాదించుకోవచ్చని పేర్కొన్నారు. మహిళా సంఘాలు ప్రతినెలా సమావేశాల్లో లావాదేవీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సిసి కృష్ణయ్య, విఒ అధ్యక్షురాలు రెడ్డెమ్మ, విఎఒ శ్రీదేవిపాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రమైన గాలివీడులో స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో 1980 నుంచి 1990 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం ఘనంగా నిర్వహించారు. సంజీవరెడ్డి, వెంకటేశ్వర్లు, మధుసూదన్, రవికుమార్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థు లందరినీ కలుపుకొని రిటైర్డ్ ప్రిన్సిపల్ కె.రామసుబ్బారెడ్డి, రిటైర్డ్ ప్రధానో పాధ్యాయులు మల్లన్న, రిటైర్డ్ ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, రిటైర్డ్ జూని యర్ అసిస్టెంట్ నరసింహారెడ్డి, శారద, కాన్వెంట్ కరస్పాండెంట్ శ్రీనివా సులను పూర్వ విద్యార్థులంతా కలిసి వారిని దుశ్శాలువాతో ఘనంగా సన్మా నించారు. సన్మానం తరం బహుమతులు కూడా అందించారు. అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసు కున్నారు. స్థానిక పాఠశాల చెందిన ఉపాధ్యాయులు కణాల శివారెడ్డి, బుక్కప ట్నం సుబ్బరాయుడు, మహమ్మద్ గౌస్ కూడా వారు సన్మానించారు. కార్యక్రమంలో ఖదీర్‌బాషా, హైదర్, అందల్లి, సుబ్బరాం, తపజుల్ హుస్సేన్,

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో పూర్వపు విద్యార్థులు

భాస్కర్, నిర్మల, శాంతి, పార్థసారథి, మధుసూదన్, వేణు,మొగల్మహమద్ బాష, శివప్రసాద్, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి : ఎస్ఐ

ద్విచక్ర వాహనదారుల వాహన రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి-కలకడ

ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ రామాంజనేయులు పేర్కొన్నారు. గురు వారం మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ హంద్రీ-నీవా కాలవ సమీపంలో చిత్తూరు-కర్నూలు జాతీయ రహ దారిపై వాహనాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి, డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. హెల్మెట్, రికార్డులు లేనియెడల వారిపై అపరాధ రుసుంతో పాటు కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. బైక్‌పై ప్రయాణించే వారు ఈ మధ్యకాలంలో తలకు గాయాలై మృతి చెందుతున్నారని, హెల్మెట్ ధరిస్తే తమ ప్రాణాలను కాపాడుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఒకవేళ ప్రమాదంలో కాలు, చేయి విరిగిన వాటికి చికిత్స చేయించుకోవచ్చని అదే తలకు తగిలితే మృతి చెందడం ఖాయం అవుతుందని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మద్యం సేవించి పట్టుబడితే కేసులునమోదు చేస్తామన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు బైక్‌లు ఇవ్వకూడదని తెలిపారు. అలా ఇస్తే తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామని అన్నారు. అతివేగం ప్రమాదకరమని, ప్రయాణం చేసే టప్పుడు కుటుంబ సభ్యులను గుర్తు పెట్టుకొని డ్రైవింగ్ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పక పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేరంపల్లి వద్ద జరుగుతున్న కోడిపందెం

యథేచ్ఛగా కోడి పందేలు

- పోలీసుల హెచ్చరికలు బేఖాతర్

ప్రజాశక్తి-గాలివీడు

పోలీసుల హెచ్చరికలను బేఖాతర్ చేస్తూ మండలంలో యథేచ్ఛగా కోడి పెందేలు నిర్వహించారు. గత ఐదేళ్లగా మండలంలో కోడి పందేలు సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించడం ఆనవాయితీగా మారిపోయింది. పండుగకు ముందే ఎస్‌పి ఆదేశాలతో కోడిపందేలు ఆడటం చట్టరీత్యా నేరమని పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించాయి. అయినా పోలీసుల ఆదేశాలను పట్టించుకోకుండా సోమ, మంగళ, బుధవారాలలో పెద్దలు, యువత కోడి పందేలు నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లి సిఐ కూడా ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోకుండా కోడి పందేలు చేపట్టారు.

మాయవతి జన్మదిన వేడుకల్లో మాట్లాడుతున్న తాళ్లపాక సుబ్రహ్మణ్యం

ఘనంగా మాయావతి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పుల్లంపేట

బిఎస్‌పి అధ్యక్షులు మాయావతి జన్మదిన వేడుకలను ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి తాళ్లపాక సుబ్ర హ్మణ్యం ఆధ్వర్యంలో గురువారం రంగంపల్లె గ్రామంలో ఘనంగా నిర్వహిం చారు. అభిమానులు, పార్టీ కార్యకర్తల మధ్య కేక్ కోసి సంబరాలు జరుపు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాయావతి దేశంలోని మనువాదులకు సింహస్వప్నమని అన్నారు. పూలే, అంబేద్కర్ కలలకు ఆమె ప్రతిరూపమని తెలిపారు. ఆమె దేశ బహుజనుల ఆత్మ గౌరవమని కొనియా డారు. కార్యక్రమంలో మస్తానయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు స్వామిత్వ సర్వేపై గ్రామసభ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

నిమ్మనపల్లి గ్రామ పంచాయతీలో స్వామిత్వ సర్వేపై శుక్రవారం గ్రామసభను నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్మనపల్లి గ్రామపం చాయతీ పరిధిలో స్వామిత్వ సర్వే కొరకు ఆర్ఒఆర్(రికార్డ్ ఆఫ్ రైట్స్) కొరకు గ్రామంలో మొత్తం గృహాలు, ఖాళీ జాగాలను సర్వే చేసి వారికి హక్కులు కల్పించడానికి ఇదివరకే సర్వే చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఏవైనా అభ్యం తరాలు, సమస్యలు ఉంటే శుక్రవారం ఉదయం 11 గంటలకు నిమ్మనపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించే గ్రామసభలో పాల్గొని సమస్యలను పరిష్కరించు కోవాలని తెలిపారు.

ముగిసిన గుండు గంగమ్మ జాతర

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని గోపగుడిపల్లి కస్పాలో వెలసిన శ్రీ గుండు గంగమ్మ జాతర మంగళ, బుధ , గురువారం మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి బుధవారం జాతరలో పాల్గొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారని అన్నారు. ఏడు చాందిని బండ్లు ఆలయం చుట్టూ ప్రదక్షణలు నిర్వహించారని తెలిపారు. చాందిని బండ్లు తిరిగేటప్పుడు కోలాటాలు, చెక్కభజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జాతర సందర్భంగా ఆలయ పూజారి పందిళ్ళపల్లి బలరామయ్య జాతరకు వచ్చిన భక్తులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ముంగర సరోజమ్మ, మాజీ సర్పంచ్ ముంగర సుబ్బయ్య, ప్రజలు, పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి బాధాకరం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని రాతి గుంటపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ రామ్మోహన్ మృతి బాధాకరమని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కలకడ-గుర్రంకొండ మార్గమధ్యంలో బుడ్డ కాలువ వంక సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాతి గుంటపల్లి పంచా యతీ ఎగువ బట్టా వారి పల్లెకు చెందిన రామ్మోహన్ మృతి చెందాడు. గురువారం ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతుదేహానికి నివాళులర్పించారు. టిడిపి మంచి నాయకుడిని కోల్పోవడం బాధాకరమని అన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. కార్యక్రమంలో పీలేరు, కలకడ టిడిపి నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అధ్యాపకుడి మృతి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

వెంకట రమణ (ఫైల్ ఫొటో)

తంబళ్లపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాప కులుగా పనిచేస్తున్న వెంకట రమణ(43) గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. రాయచోటి మండలం ఏకోలం పల్లికి చెందిన వెంకటరమణ తమ్మల్లపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు పది సంవత్సరాల నుంచి ఎకనామిక్ సబ్జెక్టుకు కాంట్రాక్టు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈయన గురువారం ఉదయం రాయచోటిలో స్వగృహంలో ఉండగా గుండెల్లో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్కం మధ్యలో పరిస్థితి విషమించడంతో మృతి చెందారని తెలిపారు. మృతుడికి నలుగురు పిల్లలు శ్రీనివాసులు, శ్రీలక్ష్మి, లాస్య, హర్షవర్ధన్ ఉండగా అందరూ చదువుకుంటు న్నారని అన్నారు. భార్య వి.రాజేశ్వరి నాలుగేళ్ల క్రితం అనారోగ్యం కారణంగా మృతి చెందారని తెలిపారు. తల్లిదండ్రులు ఇద్దరూ మృతి చెంద డంతో పిల్ల పిల్లలు అనాథలయ్యారు. ప్రభుత్వం స్పందించి పిల్లలను ఆదుకో వాలని మృతుడి బంధువులు కోరుతున్నారు. అధ్యాపకుడి మృతి పట్ల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ అమరేంద్రకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు సంతాపం తెలిపారు.

కోగటం రామసుబ్బమ్మ నేత్రదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన కోగటం రామసుబ్బమ్మ (57) మృతి చెందడంతో ఆమె నేత్రదానానికి మేనల్లుడు చంద్ర మోహన్‌రెడ్డి, కూతురు రామతులసి, మనవళ్ళు ప్రేమ్‌చరణ్ రెడ్డి, ప్రణీత్‌కుమార్ రెడ్డి అంగీకరించారు. ఈ విషయాన్ని జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమా చారమిచ్చారు. చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు డిష్ వెంకట్‌రెడ్డి ఆధ్వ ర్యంలో టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతురాలి నివాసం వద్దకు వెళ్లి ఆమె కార్ని యాలను సేకరించి హైదరాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లా డుతూ బంధువులు, సన్నిహితులు మరణిస్తే నేత్రదానం చేయదలిస్తే 99666 09364కు సమాచారం ఇవ్వాలన్నారు.